సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



ప్రజాధనం.. నిరుపయోగం

ప్రజల సౌకర్యార్థం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. 10లో ▸



తప్పిన ముప్పు

ఈదురు గాలులు, వర్షం కారణంగా చేవెళ్ల పరిధిలోని కేసారంలో హైమాస్ట్ లైట్లకు నం బంధించిన భారీ స్తంభం విరిగింది. 10లో ▸



ఎన్నికల వరకే రాజకీయం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

హిందువులపై దాడులు అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ నేతల నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ సహకార్యదర్శి బూరుగు రమణ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడికి నిరసనగా శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌ఓ సంగీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ విభాగ్ సహకార్యదర్శి బూరుగు రమణ మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించడం పేరుతో బెంగాల్ మొత్తం హింసాకాండలో కాలిపోతోందని అన్నారు. బెంగాల్‌లో భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం ద్వారా తమ ప్రభుత్వాన్ని ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మమత ప్రభుత్వం చేస్తున్న కుట్రలన్నారు. హిందూ ఉనికికి ప్రమాదం వాటిల్లిందని, హిందువులకు భద్రత కల్పించాలన్నారు. బెంగాల్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని, హింసపై ఎన్ఐఏతో విచారణ జరిపించాలని కోరారు. బంగ్లాదేశ్ రోహింగ్యా చొరబాటుదారులను గుర్తించి బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చింతల వెంకన్న, శ్రీనివాస్, రాజు, రాఘవేందర్, మహేశ్, విక్రం, సురేష్, రాజు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయం భేష్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

యాచారం: ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్‌లో అధికారుల సమన్వయం బాగుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. నానక్‌నగర్‌లో శనివారం ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్న రెవెన్యూ, పోలీస్, టీజీఐఐసీ, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులతో మర్యాదగా ఉందాం.. వారి సమస్యలు తెలుసుకుందాం, న్యాయం చేద్దాం.. ఇదే మాదిరిగా ఐక్యతతో ఉండి టార్గెట్ పూర్తి చేద్దామని పేర్కొన్నారు. రైతుల నుంచి ఏ ఇబ్బందులు వచ్చినా క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే సీఐ, తహసీల్దార్, ఆర్డీఓ, ఏసీపీల దృష్టికి తేవాలన్నారు. వేసవి తీవ్రతలో సర్వే, ఫెన్సింగ్ పనుల్లో నిమగ్నమవుతున్న సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని టీజీఐఐసీ అధికారులకు ఆమె సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడుతూ.. ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఫార్మాలో పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, ఫార్మాతో పాటు గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో శనివారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డిని ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో 10,200 ఎకరాల అసైన్డ్ భూములు, 9,133 ఎకరాల పట్టా భూములు తీసుకున్నారని తెలిపారు. వెంటనే రైతులకు రుణమాఫీ, రైతుబీమా చేయాలని, భూములు కోల్పోయిన రైతులకు 121 గజాలకు బదులు 500 గజాల ప్లా ట్లు ఇవ్వాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందుకూరు మండల కార్యదర్శి బుట్టి బాలరాజు, నాయకులు మల్లేష్, పోలు, గడ్డం యాదగిరి, రాములు, సంజీవ, గోవర్ధన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎంటీఎస్ రైళ్ల పునరుద్ధరణ

సాక్షి, సిటీబ్యూరో: వివిధ మార్గాల్లో నిలిపివేసిన 26 ఎంఎంటీఎస్ సర్వీసులను ఈ నెల 20 నుంచి పునరుద్ధరించనున్నట్లు శనివారం దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లింగంపల్లి–ఫలక్‌నుమా, ఫలక్‌నుమా–నాంపల్లి, ఫలక్‌నుమా–మేడ్చల్, ఫలక్‌నుమా–ఉందానగర్, నాంపల్లి–మేడ్చల్, సికింద్రాబాద్–మేడ్చల్ మధ్య నిలిచిపోయిన ఎంఎంటీఎస్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించనున్నాయి.

ఫీడర్!

చినుకు వేళ తీగల వణుకు
- తరచూ షార్ట్ సర్క్యూట్‌లు
- ట్రిప్పవుతున్న ఫీడర్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- గంటల తరబడి పునరుద్ధరణ పనులు
- అంధకారంలో పలు కాలనీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, ఇంటర్నెట్, టీవీ కేబుళ్లు విద్యుత్ తీగల పాలిట శాపంగా మారుతున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు ఎప్పుడు.. ఎక్కడ.. ఏ చెట్టుకొమ్మ విరిగి మీద పడుతుందో.. ఏ వైపు నుంచి ఫ్లెక్సీ/బ్యానర్ గాలికి ఎగిరివచ్చి పడుతుందో.. ఏ హోర్డింగ్ విరిగి పడుతుందో.. తెలియని పరిస్థితి. ఫలితంగా 33/11 కేవీ ఓవర్‌హెడ్ లైన్లు తెగిపడుతుండటంతో పాటు విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయి. లైన్లపై పడిన చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు ఆపరేషన్/ సెంట్రల్ బ్రేక్‌డౌన్(సీబీడీ)/డీఆర్‌ఎఫ్ బృందాలకు పెద్ద సవాల్‌గా మారింది.


ఈదురు గాలులతో బెంబేలు..

వరుస ఈదురు గాలులు బెంబేలెత్తిస్తున్నాయి. ఈనెల 3న భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి నగరంలో 57 విద్యుత్ స్తంభాలు సహా 44 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 449 ఫీడర్ల పరిధిలో సరఫరా నిలిచిపోయింది. తాజాగా శుక్రవారం ఈదురుగాలితో కూడిన వర్షానికి గ్రేటర్‌లో మొత్తం 359 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లోని చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడ్డాయి. భారీ ఈదురు గాలులు వీస్తుండటం, తరచూ ఫ్లెక్సీలు, బ్యానర్లు, చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతుండటం, ఫీడర్లు ట్రిప్పై సరఫరాలో అంతరాయాలు తలెత్తుతుండటం సంస్థకు, సిబ్బందికి ఇబ్బందిగా మారింది.



విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

- జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల సిబ్బంది ఎప్పటికప్పుడు రోడ్లకు ఇరువైపులా వెలసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు తొలగిస్తున్నప్పటికీ.. మళ్లీ వాటిని ఏర్పాటు చేస్తుండటం, సాయంత్రం ఈదురుగాలితో కూడిన వర్షానికి ఎగిరి లైన్లపై చిక్కుకుంటుండటం, అత్యవసర పరిస్థితుల్లో వాటిని తొలగించాల్సి వస్తుండటం డిస్కం సిబ్బందికి సవాల్‌గా మారింది. ఈ పనుల కోసం డిస్కం భారీగా ఖర్చు చేస్తోంది.



విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

క్షేత్రస్థాయిలోనే సీఎండీ, సిబ్బంది

ప్రస్తుత సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ప్రతి రోజూ ఉదయం అన్ని విభాగాల డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్‌ఈలు సహా డీఈలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. రోజువారీ ప్రగతిని సమీక్షిస్తున్నారు. సర్కిళ్ల వారీగా బిల్లింగ్ నమోదు, రెవెన్యూ వసూళ్లతో పాటు కొత్త కనెక్షన్ల జారీపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విపత్తుల సమయంలో స్వయంగా ఆయనే ఫీల్డ్‌లోకి వెళ్తున్నారు. దగ్గరుండి పునరుద్ధరణ పనులను సమీక్షిస్తున్నారు. ఫలితంగా అంతరాయాల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టడం శుభపరిణామం.



రోడ్డుకు అడ్డుగా ఉన్న ప్రహరీ జేసీబీతో తొలగింపు

కాలనీలకు 'దారి' చూపిన హైడ్రా

హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

తుర్కయంజాల్: 'హైడ్రా' చొరవ పలు కాలనీలకు 'దారి' చూపింది. తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్లు 213, 214, ఇంజాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 131లో 2.24 ఎకరాల భూమి తమదని, కోర్టు తీర్పు అనుకూలంగా ఉందని, ఎవరూ దీంట్లోకి ప్రవేశించడానికి వీలు లేదంటూ 2023 నవంబర్‌లో వైజయంతి మాల, గోవింద్ దాస్, అమ్రీష్ వీరన్ అనే ముగ్గురు ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేశారు. ఈ భూమిని 1974లోనే ఏషియన్ హౌసింగ్ కార్పొరేషన్ వెంచర్ ఏర్పాటు చేయగా అనేక మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. ప్రీకాస్ట్ ఏర్పాటు చేయడం, ప్లాట్లలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో చేసేదేలేక బాధితులు కోర్టును ఆశ్రయించారు. పలు మార్లు మున్సిపల్ కార్యాలయం, ప్లాట్ల వద్ద ఆందోళనకు దిగడంతో పాటు పలువురు అధికారులను కలిశారు. అయినా ఫలితం లేకపోయింది. ఇటీవల ప్లాట్ల యజమానులు, స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు శనివారం రెండు జేసీబీలు, బందోబస్తుతో అక్కడికి చేరుకుని ప్లాట్ల చుట్టూ ఉన్న ప్రీకాస్ట్‌ను, రోడ్లకు ఉన్న అడ్డంకులను తొలగించారు. దీంతో శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీ, అపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీశ్రీ నివాస్ కాలనీలకు వెళ్లే రోడ్డు మార్గం కొన్ని నెలల విరామం తర్వాత సుగమమైంది. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



సదస్సులో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత తదితరులు

మహిళల కోసం ప్రోత్సాహకాలు

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. జిల్లా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్ ప్రోగ్రాం గురించి శనివారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీహబ్‌తో జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగమన్నారు. ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీస్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ నిధులతో చేపడుతున్న ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో మద్దతుగా నిలుస్తుందన్నారు. రెండేళ్ల పాటు కొనసాగుతున్న ఈ ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలు బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఇందులో భాగంగా టెక్స్‌టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, హస్తకళల వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డైవర్సిఫికేషన్, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్‌లింకేజ్, ఎక్స్‌పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుందని తెలిపారు. అనంతరం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వీహబ్ డైరెక్టర్ అక్తర్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఉహా సజ్జ, డీపీఎంలు, ఏపీఎంలు, స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యూనిఫామ్ త్వరగా అందించేలా చూడాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ త్వరితగతిన అందించేలా చూడాలని డీఆర్‌డీఓ శ్రీలత ఏపీఎంలు, సీసీలను ఆదేశించారు. విద్యార్థులకు సరైన కొలతలు తీసుకోవాలని తెలిపారు. క్లాత్ వచ్చిన తరువాత ఏవిధంగా కటింగ్ చేయాలో కొలతల ప్రకారం కుట్టేలా చూడాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

కడ్తాల్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఏర్పాటు చేసి 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి ఎర్త్‌సెంటర్‌లో యూత్ లీడర్స్ కాంక్లేవ్ ఫర్ బెటర్ ఎర్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో పర్యావరణానికి సంబంధించి సరైన పాఠ్య ప్రణాళికను తయారు చేసి సిలబస్‌లో ప్రవేశపెడతామన్నారు. విద్యార్థులు నవతర పర్యావరణ పరిరక్షకులని, పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. సమాజ శ్రేయస్సు, పుడమి తల్లి సేవకు సీజీఆర్ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సిటీ ఒక నాలెడ్జ్ హబ్ కావాలని, పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇతర దేశాలతో పోలిస్తే, మన విద్యార్థులు పర్యావరణాన్ని గొప్ప లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు. మన సహజ సంపదను మనం కాపాడుకోవాలని సీజీఆర్ ఛైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టి పర్యావరణ రక్షణకు నడుం బిగించాలన్నారు. పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక శక్తిగా మారి, పర్యావరణ రక్షణకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ నవీన్‌రావు, డాక్టర్ జగన్, డాక్టర్ వసంతలక్ష్మి, వెంకటేశ్, సీజీఆర్ సిబ్బంది ఉన్నారు.

0001కు రూ.7.75 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యేక నంబర్‌లపై ఆర్టీఏ శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో సినీనటుడు బాలకృష్ణ పోటీ పడ్డారు. రూ.7,75,000 చెల్లించి 'టీజీ 09 ఎఫ్0001' నంబర్‌ను ఆయన సొంతం చేసుకున్నారు. కమలాలయ హిల్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పోటీలో రూ.6,70,000 చెల్లించి 'టీజీ 09ఎఫ్ 0009'ను దక్కించుకుంది. 'టీజీ09 ఎఫ్ 9999' నంబర్‌కు ఎకోడిజైన్ స్టూడియో రూ.99,999 చెల్లించి సొంతం చేసుకుంది. జెట్టి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్' 'టీజీ09 ఎఫ్0005' కోసం రూ.1,49,999 చెల్లించి సొంతం చేసుకుంది. 'టీజీ09ఎఫ్ 0007' నంబర్ కోసం కె.శ్రీనివాస్ నాయుడు రూ.1,37,779 చెల్లించారు. 'టీజీ09ఎఫ్ 0019'కు నేత్రావతి బలగప్ప శివాలినిప్ప రూ.60,000 చెల్లించారు. 'టీజీ 09ఎఫ్ 0099' కోసం కాన్‌క్యాప్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.4,75,999 చెల్లించింది. శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ప్రత్యేక నంబర్లపై రూ.37,15,645 లభించినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు.

లోపాలను సరిచేసేందుకే 'భూ భారతి'

మండలి చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ధరణి లోపాలను సరిచేసి, రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుతవం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపల్ పరిధి మల్కాపూర్ సమీపంలోని ఓ కన్వెన్షన్‌లో శనివారం భూభారతిపై చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి పోర్టల్‌తో ఏర్పడిన అనేక సమస్యలను సవరించే వీలుకూడా లేకపోవడంతో పదేళ్లుగా రైతులు అనేక కష్టాలు పడ్డారని తెలిపారు. భూ భారతి చట్టంతో రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో సమస్యలు అనేవి రాకుండా కొత్త చట్టంలో అనేక అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భూ భారతతిలో అధికార వికేంద్రీకరణతో మండల, డివిజన్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని చెప్పారు. చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు వసంతం, మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్‌లు పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, డీవీఆర్, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో నిర్వహించి సమావేశంలో మాట్లాడుతున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

ఎన్నో సమస్యలకు పరిష్కారం

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన భూ భారతి చట్టం ఎన్నో భూ సమస్యలకు పరిష్కారం చూపబోతోందని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ శివారులోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు, ఎంపీడీఓ వెంకయ్య పాల్గొన్నారు.

సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై ఆయన వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా పనుల పురోగతిని తెలుసుకున్నారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన సమీక్షించారు. స్టేషన్ బుకింగ్, పార్కింగ్, సర్క్యులేటింగ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పునరాభివృద్ధి పనులను అత్యున్నత ప్రమాణాలతో కట్టుదిట్టమైన భద్రతను కొనసాగిస్తూ కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సర్కారు బడుల్లో సౌకర్యాల సర్వే

- ఇప్పటికే యూడైస్‌ప్లస్‌లో వివరాలు నమోదు చేసిన ప్రధానోపాధ్యాయులు
- వాస్తవాలపై థర్డ్‌పార్టీతో విద్యాశాఖ సర్వే
- జిల్లాలో 1,244 ప్రభుత్వ పాఠశాలలు
- సర్వేలో పాలుపంచుకుంటున్న 96 మంది విద్యార్థులు
- ఈనెల 21వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం

కేశంపేట: సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు చేపట్టిన సర్వే జిల్లాలో కొనసాగుతోంది. ఈ నెల 15న ప్రారంభమైన సర్వే 21వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని యూడైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)లో నమోదు చేస్తారు. ఈ సమాచారంతోనే పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు కావాల్సిన ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయిస్తుంది. యూడైస్ ప్లస్‌లో ప్రధానోపాధ్యాయులు ఇస్తున్న సమాచారంపై వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా యూడైస్ ప్లస్‌లో ఇచ్చిన సమాచారంపై విద్యాశాఖ థర్డ్‌పార్టీతో సర్వే నిర్వహిస్తోంది.

సర్వేలో డైట్ కళాశాల విద్యార్థులు

జిల్లాలోని 27 మండలాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల, మోడల్ పాఠశాలలు కలిపి మొత్తం 1,244 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో యూడైస్ ప్లస్‌పై సర్వే నిర్వహించేందుకు వికారాబాద్‌లోని డైట్ కళాశాల విద్యార్థులతో పాటు ఇబ్రహీంపట్నం సమీపంలోని ప్రజ్ఞ డైట్ కళాశాల విద్యార్థులు 96 మంది సర్వేలో పాల్గొంటున్నారు. ఒక్కో విద్యార్థికి పది పాఠశాలల చొప్పున్న జిల్లా కార్యాలయం నుంచి లిస్టు అందిస్తున్నారు.



కేశంపేట మండలం దత్తాయపల్లిలోని పాఠశాలలో మరుగుదొడ్ల పరిశీలన

యూడైస్‌లో హెచ్‌ఎంల నమోదు..

యూడైస్ ప్లస్‌లో టాయిలెట్స్ వివరాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, మధ్యాహ్న భోజన వివరాలు, విద్యార్థుల ఆధార్ అనుసంధానం, స్కూల్ యూనిఫాంల పంపిణీ, పాఠ్యపుస్తకాల పంపిణీ లాంటి వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే పాఠశాల ఆవరణలో క్రీడాస్థలం ఉందా లేదా, తరగతి గదుల సంఖ్య, ల్యాబ్, ఫర్నిచర్ వివరాలు సైతం ఇప్పటికే నమోదు చేశారు. ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలపై ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది.

సర్వే చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు లిస్టు ప్రకారం తమకు కేటాయించిన పాఠశాలల్లో సర్వే చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. లిస్టును రెండు కాపీలు చేసి ఒకటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి, మరొకటి డైట్ కళాశాలలో అందించనున్నారు. ఈ 21లోగా సర్వే పూర్తి చేసి వివరాలు డైట్ కళాశాలలో అందించాల్సి ఉంటుంది. డైట్ కళాశాలలో అందించిన లిస్టును కళాశాల సిబ్బంది ఈ నెల 22న డీఈఓ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది.

సర్వేకు సహకరిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా అధికారుల సూచనలతో యూడైస్ ప్లస్‌లో ఇచ్చిన వివరాలపై సర్వే కొనసాగుతోంది. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన లిస్టు ప్రకారం ఆయా పాఠశాలలకు వెళ్లేందుకు రూట్ మ్యాప్ ఇస్తూ సర్వేకు సహకరిస్తున్నాం.

– మఠం చంద్రశేఖర్, ఎంఈఓ, కేశంపేట

'వక్ఫ్'సవరణకు వ్యతిరేకంగా..



షాహిన్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

పహాడీషరీఫ్: వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకంగా నగరంలోని దారుస్సలాంలో తలపెట్టిన బహిరంగ సభకు జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి ముస్లింలు శనివారం సాయంత్రం భారీగా తరలివెళ్లారు. ఎంఐఎం పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అహ్మద్ సాదీ పర్యవేక్షణలో మాజీ చైర్మన్ అబ్దుల్లా సాదీ, నాయకులు ఉమర్ బామ్, ఉస్మాన్ షరీఫ్, హసన్ షా తదితరులు వందలాది మంది యువకులతో బయల్దేరారు. ఈ సందర్భంగా అహ్మద్ సాదీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముస్లింలకు సంబంధించిన ఆస్తులను లాక్కొనేందుకే వక్ఫ్ సవరణకు పట్టుబట్టిందన్నారు. ఇటీవల ఈ విషయంలో సుప్రీం కోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసిందన్నారు.

జాబ్ ఫ్రాడ్ కేసులో కేటుగాడి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: జాబ్ పోర్టల్స్, సోషల్ మీడియా, టెలిగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగులను సంప్రదించి ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న సైబర్ నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన యువతి ఇండీడ్ జాబ్ పోర్టల్‌లో ఉద్యోగానికి రిజిస్టర్ చేసుకుంది. అనంతరం ఆమెకు +91 9318498011, +91 9821176350 నంబర్ల నుంచి సైబర్ నిందితుడు ఫోన్ చేశాడు. తనను రాజత్ అని పరిచయం చేసుకున్న కేటుగాడు.. ఆరు కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నాయని బాధితురాలిని నమ్మించాడు. ఏదైనా కంపెనీని ఎంచుకోవాలని సూచించి, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 3 వేలు చెల్లించాలని కోరాడు. రుసుము చెల్లించిన అనంతరం బ్యాక్ గ్రౌండ్ వెరిఫికేషన్ కోసం మరో రూ.10,999 మొత్తాన్ని కోరాడు. అయితే అందుకు ఆమె అంగీకరించలేదు. దీంతో ఉద్యోగం ఖచ్చితంగా వస్తుందనీ, నియామక ప్రక్రియ మొదలైన తర్వాత చెల్లించిన మొత్తం తిరిగి ఇస్తామని నమ్మించాడు. మెడికల్ ఇన్సూరెన్స్, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని సూచించాడు. మొత్తం బాధితురాలి నుంచి రూ. 1.49 లక్షలు వసూలు చేశాడు. అనంతరం నకిలీ జాబ్ కన్ఫర్మేషన్ లెటర్లు పంపించారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది.

తప్పిన ముప్పు


కేసారంలో విద్యుత్ తీగలపై పడిన స్తంభం

చేవెళ్ల: మండలంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షం కారణంగా మున్సిపల్ పరిధిలోని కేసారంలో హైమాస్ట్ లైట్లకు సంబంధించిన భారీ స్తంభం విరిగింది. ఇది తీగలపై వాలడంతో కిందపడలేదు. దీంతో పెను ప్రమాదమే తప్పిందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి, సరఫరా నిలిపివేయించారు. అనంతరం విరిగిన స్తంభాన్ని జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.


చేవెళ్లలో నిరుపయోగంగా రైతు బజార్


రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన షెడ్లు

ప్రజాధనం.. నిరుపయోగం

ప్రజాధనం వృథాగా పోతోంది. రూ.లక్షలు వెచ్చించి ఎంతో ఆర్భాటంగా నిర్మించిన రైతుబజార్ ఉపయోగంలో లేక వెలవెలబోతోంది. దాదాపు నాలుగేళ్ల నుంచి చేవెళ్లలో ఇదే దుస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

- చేవెళ్లలో వెలవెలబోతున్న రైతు బజార్
- ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చేవెళ్ల: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.కోటి నిధులు వెచ్చించి రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయిన నాటి నుంచి వృథాగా పడి ఉంది. మండలంలోని రైతులు, ప్రజలకు అందుబాటులో మార్కెట్ ఉండాలనే లక్ష్యంతో రైతు బజార్ ఏర్పాటు చేశారు. చుట్టు ఉన్న గ్రామాల అన్నదాతలు పండించిన కూరగాయలను నిత్యం ఇక్కడ అమ్ముకునేందుకు కావాల్సిన షెడ్లు, దుకాణ సముదాయలను సైతం నిర్మించారు. కరోనా కంటే ముందుగానే ఈ రైతు బజార్ నిర్మాణం అందుబాటులోకి వచ్చినా కూరగాయల విక్రయాలు మాత్రం జరగటం లేదు. దీంతో ఈ షెడ్‌లు నిరుపయోగంగా ఉండటంతో తాగుబోతులకు అండగా మారుతుంది. మార్కెట్ కమిటీ చైర్మన్లు రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకువస్తామని చెబుతున్నారే కానీ ఆచరణలోకి తేవడం లేదు. ఇప్పటికే ముగ్గురు చైర్మన్లు మారినా రైతు బజార్ దుస్థితి మాత్రం పోవడం లేదు.

రోడ్లపైనే కూరగాయల వ్యాపారాలు

కూరగాయలు, పండ్లు విక్రయించుకునేందుకు కావాల్సిన స్థలం రైతు బజార్‌లో ఏర్పాటు చేసినా పట్టణ కేంద్రంలో అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ మార్కెట్‌ను రైతు బజార్‌లోకి తరలిస్తామని చెబుతున్నారే కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంగా మారటంతో రోడ్ల విస్తరణ చేపడుతున్నారు. ఇప్పటికైనా రహదారిపై ఉన్న వ్యాపారాలను రైతు బజార్‌లోకి మారిస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని విన్నవిస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి


రూ.లక్షల వెచ్చించి నిర్మించిన రైతు బజార్‌ను ఏళ్ల తరబడిగా ఉపయోగించుకోవటం లేదు. మార్కెట్ అధికారులు, పాలకమండలి కమిటీ సభ్యులు ఏమి చేస్తున్నారు. రోడ్లపైనే వ్యాపారాలు చేసుకుంటున్న వారికి రైతు బజార్‌లో సౌకర్యాలు కల్పించి అమ్ముకునేందుకు ఏర్పాట్లు చేయాలి.

– అనంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, చేవెళ్ల

ఉపయోగంలోకి తెస్తున్నాం


రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకు వచ్చేందుకు మార్కెట్ కమిటీ తరఫున కృషి చేస్తున్నాం. కొత్తగా ఏర్పడిన పాలకమండలి సభ్యులంతా దీనిపై నిర్ణయం తీసుకొని అధికారులతో చర్చించాం. త్వరలోనే ఉపయోగంలోకి తీసుకు వస్తాం. రైతు బజార్‌ను శుభ్రం చేయించాం.

– పెంటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్, చేవెళ్ల

వ్యక్తి అదృశ్యం


నరేష్‌రెడ్డి (ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. జిల్లెలగూడ ఓంకార్‌నగర్‌కు చెందిన బాణాల నరేష్‌రెడ్డి (37) జిల్లెలగూడ బొడ్రాయి వద్ద పెట్‌షాపు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితం పని నిమిత్తం బయటకు వెళ్తున్నానని భార్య లయతో చెప్పి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి


షాద్‌నగర్‌లో మాట్లాడుతున్న రవి

షాద్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పెండింగ్ డీఏల చెల్లింపునకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య, జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శి నర్సింలు, మండల అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, నాయకులు చంద్రశేఖర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి హత్యకు కుట్ర

- సుపారీ హంతకుల అరెస్ట్
- మారణాయుధాలు స్వాధీనం

గోల్కొండ: పాత కక్షల నేపథ్యంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన ప్రత్యర్థిని అంతమొందించేందుకు పథకం వేశాడు. ఇందులో భాగంగా ఐదుగురు సభ్యుల ముఠాతో ఒప్పందం చేసుకున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శనివారం సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్దిఖి వివరాలు వెల్లడించారు. అశ్రాఫ్ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. 2020లో జరిగిన జంట హత్యల కేసులో అతను నిందితుడిగా ఉన్నాడు. అతడిపై కక్ష పెంచుకున్న అతడి ప్రత్యర్థులు అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇంతియాజ్, అవైస్, అఫ్రాజ్, ఫిర్దోజ్ ప్రణాళిక రూపొందించారు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సౌత్ వెస్ట్ జోన్ టీమ్ లంగర్‌హౌస్ పోలీసులతో కలిసి శుక్రవారం రాత్రి లంగర్‌హౌస్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రెండు దేశీ పిస్టల్స్, ఐదు రౌండ్ల బుల్లెట్లు, కారు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారికి సహకరించిన జాబేర్, మహ్మద్ జమీల్ అలియాస్ జమ్ము పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, లంగర్‌హౌస్ సీఐ రఘుకుమార్, సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ బాలస్వామి, ఎస్ఐ రాఘవేంద్రస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయం


ఆగాపల్లిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

- అభివృద్ధిలో అందరితో కలిసి నడుస్తాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

మంచాల: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్, జాపాల, అస్మత్‌పూర్ గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ తదితర పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ఆగాపల్లి– నోముల రోడ్డును రూ.4 కోట్లతో బీటీగా మార్చామన్నారు. ఈ రహదారితో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ కోసం రూ.11 లక్షలు, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామన్నారు. కాగజ్‌ఘట్‌లో రూ.6 లక్షలతో కబ్రస్తాన్ చుట్టూ ప్రహరీ నిర్మించామని, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మించామని, జాపాలలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులు చేపట్టామని తెలిపారు. అస్మత్‌పూర్‌లో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, మరో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేశామని స్పష్టంచేశారు. మండలంలోని 33 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.13 లక్షలు అందజేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో కూడా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు చేసే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని వెల్లడించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు ఎల్లేశ్, పాండు, పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ఎంవీ ప్రసాద్, పీఆర్ డీఈఈ అబ్బాస్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, వాజిద్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పోరాటం గొప్పది..

దేశ స్వాతంత్య్రం కోసం కాంగ్రెస్ చేసిన పోరాటం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఆగాపల్లి, కాగజ్‌ఘట్, అస్మత్‌పూర్ గ్రామాల్లో శనివారం జై బాపు.. జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిగళ్ల మహిపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం కేంద్రానివే

- రాష్ట్ర ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లిలో రేషన్ లబ్ధిదారుడు చీర మహేందర్ ఇంట్లో శనివారం బీజేపీ నాయకులతో కలిసి సన్న బియ్యంతో వండిన భోజనం తిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని తామే ఇస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఎద్దేవా చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, యువ నాయకులు డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ బోర్డు కమిటీ సభ్యుడు సామ మానిక్యరెడ్డి, నాయకులు ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, జయశంకర్ తదితరులు ఉన్నారు.


దేవునిఎర్రవల్లిలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న రత్నం, బీజేపీ నేతలు

అద్దంకి.. నోరు అదుపులో పెట్టుకో

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కేఎస్ రత్నం హెచ్చరించారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి దయాకర్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మండిపడ్డారు. మంత్రి పదవి కోసం.. దేశ ప్రధానిని విమర్శిస్తే దళితజాతి అంగీకరించబోదని తెలిపారు. ఎవరైనా స్థాయికి తగ్గట్లు మాట్లాడితే బాగుంటుందని తెలిపారు. కులం, మతం పేరుతో రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు తగదన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెలిపారు.

సన్న బియ్యం.. స్పందన భేష్

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని పలు రేషన్ దుకాణాలను హైదరాబాద్ జిల్లా సివిల్ సప్లై అధికారులు శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ఎలా కొనసాగుతోందని ఆరా తీశారు. కోటా వచ్చిన రెండు రోజుల్లోనే లబ్ధిదారులు అందరూ బియ్యం తీసుకెళ్లడంపై సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని డీలర్లు తెలిపారు. బాలాపూర్‌లోని రేషన్ దుకాణాలతోపాటు బడంగ్‌పేట్‌లోని రేషన్ షాప్ నంబర్– 4, 11, 22లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని దుకాణాలకు సకాలంలో కోటా అందేలా చూస్తామని సివిల్ సప్లై టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్లు బాల్‌రెడ్డి, కల్యాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల రేషన్ దుకాణాల సంఘం అధ్యక్షుడు టీకుల శశిధర్ రెడ్డి, డీలర్లు బి.నర్సింహారెడ్డి, భీమిడి నర్సింహారెడ్డి, అవుల పావని పాల్గొన్నారు.


బాలాపూర్‌లో సివిల్ సప్లై అధికారులు